క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

మిర్యాలగూడ అర్బన్ : మిర్యాలగూడ పట్టణంలో రోడ్డు వైండింగ్ పనుల్లో భాగంగా 11 కేవీ హౌజింగ్ బోర్డు ఫీడర్ నుంచి విద్యుత్ సరఫరా వచ్చే లైన్లకు సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ ఎన్.రవీందర్‌రెడ్డి తెలిపారు. సాగర్ రోడ్డులోని మ్యాక్స్ శాపింగ్ కాంప్లెక్స్ నుంచి కరాచీ బేకరీ వరకు ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు, అదేవిధంగా ఎఫ్‌సీఐ ఇండస్ట్రియల్ కింద ఉన్న ఎంఆర్‌ఐ మిల్లు నుంచి ఆ ప్రాంతంలో ఉన్న అన్ని మిల్లులకు మధ్యాహ్నం 12 గంటల నుంచి 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన తెలిపారు.

ఎన్‌సీసీ క్యాడెట్‌కు సన్మానం



ఎన్‌సీసీ క్యాడెట్ మహేష్‌ను సన్మానిస్తున్న అధ్యాపకులు

దేవరకొండ: విద్యార్థులు చదువుతో పాటు నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలని దేవరకొండ ఎంకేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ రమావత్ రవి అన్నారు. కళాశాలకు చెందిన ఎన్‌సీసీ క్యాడెట్ ఇరిగింటి మహేష్ రిపబ్లిక్ డే క్యాంపు(ఆర్డీసి) పూర్తి చేసుకొని సోమవారం తిరిగి వచ్చిన సందర్భంగా కళాశాలలో ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు తాము ఏర్పరుచుకున్న లక్ష్య సాధనకు నిరంతరం శ్రమించాలని సూచించారు. అనంతరం మహేష్‌ను కళాశాల అధ్యాపకులు శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో సత్యనారాయణ, శాంసన్, రాజేష్, లింగమయ్య, కోటయ్య పాల్గొన్నారు.

కందుల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న సీపీఐ మండల కార్యదర్శి సుదర్శన్‌రెడ్డి

దేవరకొండ: అధికారులు కందుల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని సీపీఐ దేవరకొండ మండల కార్యదర్శి దేప సుదర్శన్‌రెడ్డి కోరారు. సోమవారం దేవరకొండ పట్టణంలోని పల్లా పర్వత్‌రెడ్డి భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మార్కెట్లలో కందుల కొనుగోలు కేంద్రాలను నేటికీ ప్రారంభించక పోవడంతో రైతులు ఇళ్లల్లోను పంటను నిల్వ చేశారని తెలిపారు. సమావేశంలో పల్లా రంగారెడ్డి,వలమల్ల ఆంజనేయులు,కాటం గోవర్ధన్ పాల్గొన్నారు.

దరఖాస్తుల గడువు పెంపు

గుర్రంపోడు : మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్‌లో 2025–2026 విద్యా సంవత్సరానికి సంబంధించి అడ్మిషన్ల దరఖాస్తు గడువును మార్చి 10వ తేదీ వరకు పొడిగించినట్లు ప్రిన్సిపాల్ జి. రాగిణి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆరవ తరగతికి వంద సీట్లు, ఇతర తరగతులకు ఖాళీగా ఉన్న సీట్లకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, పీహెచ్‌సీ, ఈడబ్ల్యూఎస్ విద్యార్థులు రూ.125, ఇతరులు రూ. 200లు చెల్లించాలని తెలిపారు.

గ్రామ పంచాయతీ కార్మికుడికి నివాళి

త్రిపురారం : మండలంలోని బాబుసాయి పేట గ్రామ పంచాయతీ కార్మికుడు బొజ్జ సైదయ్య అనారోగ్యంతో ఆదివారం మృతిచెందాడు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షుడు పోలె సాంబయ్య త్రిపురారం మండల కమిటీ సభ్యులతో కలిసి బాబుసాయి పేటలో బొజ్జ సైదయ్య ఇంటికి వెళ్లి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే మృతుడి కుటుంబ సభ్యులకు బుసిరెడ్డి ఫౌండేషన్ చైర్మన్ బుసిరెడ్డి పాండురంగారెడ్డి ఆర్థికసాయం అందజేసి పరామర్శించారు. కార్యక్రమంలో పలు రాజకీయ పార్టీల నాయకులు, గ్రామ పంచాయతీ కర్మికులు తదితరులు పాల్గొన్నారు.

కరాటేలో గుర్రంపోడు బాలికల ప్రతిభ

గుర్రంపోడు : రాష్ట్ర కరాటే ఛాంపియన్ షిప్ పోటీల్లో గుర్రంపోడు మండల విద్యార్థినులు ప్రతిభ చూపారు. జిల్లా కేంద్రంలోని శివాంజనేయ గార్డెన్‌లో జరిగిన కరాటే వారియర్ కప్ 2025 పోటీల్లో మండలంలోని ఉన్నత పాఠశాలల నుంచి 23 మంది విద్యార్థినులు పాల్గొన్నారు. పిట్టలగూడెం హైస్కూల్ నుంచి బి. కావ్య మొదటిస్థానం, ఎస్. పల్లవి మూడో స్థానం, కేజీబీవీ నుంచి ఎస్.అశ్విని రెండో స్థానం పొందడంతోపాటు ధనశ్రీ, ధనలక్ష్మి, తేజస్, శ్రీవాణి, శ్రావణి, వర్ష, కల్పనలు ప్రతిభ కనబరిచారు.

పదోతరగతి ఇంటర్నల్ మార్కుల పరిశీలన

పెద్దవూర : మండల కేంద్రంలోని ఆశ్రమ పాఠశాలలో సోమవారం ఇంటర్నల్ మార్కుల మూల్యాంకనాన్ని తిరుమలగిరి(సాగర్) మండల ఎంఈఓ కొనమంచిలి శ్రీనివాస్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అమృతయ్య, పాఠశాల హెచ్ఎండీ బాలోజీ, ఉపాధ్యాయులు షబ్బీర్, కృష్ణ, శ్రీను, సంధ్య, షాహిన్‌బేగం, రామయ్య, సైదులు, శాంతి పాల్గొన్నారు.

కుంగుతున్న ఎడమకాలువ కట్ట



కుంగిపోయిన కాలువకట్ట

తిరుమలగిరి(నాగార్జునసాగర్): నాగార్జునసాగర్ ప్రాజెక్టు ఎడమకాలువకు ప్రమాదం పొంచి ఉంది. తిరుమలగిరి(సాగర్) మండలంలోని అల్వాల గ్రామ శివారు చిన్నచెరువు వద్ద 10వ కిలోమీటర్, ఆర్–1 లిఫ్టుకు సమీపంలో ఉన్న కాలువ కట్ట పూర్తిగా కుంగిపోయింది. కాలువలోకి దిగేందుకు ఏర్పాటు చేసిన మెట్లు కూడా కుంగుబాటుకు గురికావడంతో మట్టి కోతకు గురవుతోంది. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం పొంచి వస్తుందోనని రైతులు, సమీప గ్రామాల ప్రజలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కట్ట ప్రమాదానికి గురైతే సమీప గ్రామాలు మునిగిపోవడంతో పాటు, వేల ఎకరాల్లో పంట నష్టం జరగనుందని రైతులు పేర్కొంటున్నారు. సంబంధిత నీటిపారుదల అధికారులు స్పందించి కాల్వకట్టకు మరమ్మతు చేపట్టాలని రైతులు కోరుతున్నారు. దీంతో పాటు పైభాగంలోని ఆర్ –1 లిఫ్టు వద్ద కూడా ప్రమాదం పొంచి ఉంది.

విద్యార్థినులు ఉన్నతంగా రాణించాలి



విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ ఉదయశ్రీ

హాలియా: విద్యార్థినులు ఉన్నతంగా రాణించాలని సీడీపీఓ కేవీపీ ఉదయశ్రీ అన్నారు. సోమవారం పట్టణంలోని కేజీబీవీ పాఠశాలల్లో విద్యార్థులకు నిర్వహించిన బేటీ బచావో బేటీ పడావో అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఆడపిల్లలంటే చిన్న చూపు చూడకుండా బాలురతో సమానంగా చదువు చెప్పించాలన్నారు. బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. అనంతరం బాల్య వివాహాలు, బాల కార్మికులు, బాలిక విద్య ప్రాముఖ్యత, సంక్రమిత వ్యాధుల నివారణ చర్యలు, హెల్త్ ఎడ్యుకేషన్, పర్సనల్ హైజిన్, పోషకాహారం తదితర అంశాల గురించి విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ రామకృష్ణ, కేజీబీవీ ప్రిన్సిపాల్ హైమావతి, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ టీచర్స్ తదితరులు పాల్గొన్నారు.

ఆస్తి పన్ను చెల్లించకుంటే ఆసులు జప్తు

మిర్యాలగూడ టౌన్ : మున్సిపాలిటీలో ఆస్తి పన్ను చెల్లించకుంటే ఆస్తులు జప్తు చేస్తామని మున్సిపల్ కమిషనర్ మహ్మద్ యూసుఫ్ హెచ్చరించారు. సోమవారం మిర్యాలగూడలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మున్సిపాలిటీలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాలు మినహాయిస్తే ఆస్తి పన్ను రూ.21, 81, 86000 కోట్లకు గాను ప్రస్తుతం రూ.5, 91, 74000 వసూలు అయినట్లు తెలిపారు. కేవలం 27.12 శాతం మాత్రమే పన్ను వసూలు అయ్యాయని తెలిపారు. మొండి బకాయిలు ఉన్న వారికి నోటీసులు ఇచ్చామని, మరోసారి నోటీసుల ఇవ్వమని, నేరుగా ఆస్తులు జప్తు చేయడమేనని అన్నారు. ఎల్ఆర్ఎస్ ప్రక్రియ ముమ్మరం చేశామని, ఎల్ఆర్ఎస్‌కు 28 మంది వార్డు ఆఫీసర్లను నియమించినట్లు తెలిపారు. పట్టణ ప్రజలు ఆస్తి పన్నులు చెల్లించి పట్టణాభివృద్ధికి సహకరించాలని కోరారు. సమావేశంలో ఆర్ఓ జ్ఞానేశ్వరి, ఆర్ఐలు సాంబయ్య, సాజీ, తదితరులు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో హరినామ సంకీర్తన



సంకీర్తనలో పాల్గొన్న పీఠాధిపతి, ఆలయ కమిటీ సభ్యులు

మిర్యాలగూడ : పట్టణంలోని హౌసింగ్‌బోర్డు కాలనీలో గల శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో మిర్యాలగూడ సాంస్కృతిక కళా కేంద్రం, శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ కమిటీ సంయుక్తంగా శ్రీశ్రీ విజయ శంకరస్వామి, శ్రీఅన్నమాచార్య కళా క్షేత్రం పీఠాధిపతులచే సోమవారం హరినామ సంకీర్తనను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం 8గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు జరిగిన ఈ అఖండ హరినామ సంకీర్తనలో భాగంగా భజన, కోలాటం, నృత్య ప్రదర్శనలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు సూదిని వెంకట్‌రెడ్డి, రంగయ్య, ఉపాధ్యక్షుడు వేణుగోపాల్ రావు, సత్యం, అర్చకులు కారంపూడి రాఘవాచార్యులు, సాంస్కృతిక కళా కేంద్రం అధ్యక్షుడు పరిమి రామావతారం, ఉపాధ్యక్షుడు దుర్గి శ్రీనివాస్‌శర్మ, కార్యదర్శి పులి కృష్ణమూర్తి, ఆర్గనైజింగ్ సెక్రటరీ పుల్లాభట్ల లక్ష్మీనారాయణశర్మ, ప్రచార కార్యదర్శి మామిడాల ఉపేందర్, వీరప్రతాప్, సత్యనారాయణ, జానీ, వేణుగోపాలశర్మ, నరసింహమూర్తి, కృష్ణమోహన్ పాల్గొన్నారు.

వైభవంగా బొడ్రాయి ప్రతిష్ఠాపనోత్సవాలు



జాల్‌తండాలో బొడ్రాయి వద్ద పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్సీ కోటిరెడ్డి

తిరుమలగిరి(నాగార్జునసాగర్): ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని జాల్‌తండాలో నిర్వహించిన బొడ్రాయి ప్రతిష్ఠాపన ఉత్సవాల్లో ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ... పండుగలు మన సంప్రదాయాలు, సంస్కృతిని ప్రతిబింబిస్తాయన్నారు. అనంతరం గ్రామస్తులు ఆయనను సన్మానించారు. కార్యక్రమంలో తాజా మాజీ సర్పంచ్ స్వామి నాయక్, చందంపేట మాజీ ఎంపీపీ సుబ్బు నాయక్, నాయకులు మునినాయక్, పంతులు, స్వామి, బావోజీ, రాములు, శ్రవణ్‌కుమార్, నరేష్, ప్రకాశ్, నాగేష్, విజయ్, శ్రీను, చావర్, జగన్‌మోహన్‌రెడ్డి, రాజేష్, అశోక్, పవన్, నిమా తదితరులు పాల్గొన్నారు.

చిత్రలేఖనంలో మిర్యాలగూడ విద్యార్థుల ప్రతిభ



ప్రశంసాపత్రాలతో విద్యార్థులు

మిర్యాలగూడ టౌన్ : విజయవాడలో ఈనెల 23వ తేదీన స్ఫూర్తి క్రియేటివ్ ఆర్ట్స్, డాక్టర్ కేకేఆర్ హ్యాపీ వ్యాలీ స్కూల్ విజయవాడ వారు సంయుక్తంగా నిర్వహించిన రాష్ట్ర స్థాయి స్పాట్ పెయింటింగ్‌లో మిర్యాలగూడ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. విజయ్ డ్రాయింగ్ క్లాసెస్ విద్యార్థులు కోట్ల రిత్విక్ రెడ్డి, వి.నాగనందిని ×సేవ్ నేచర్ ఫర్ ఫ్యూచర్॰ అనే అంశంపై చిత్రాలు వేసి బహుమతులు అందుకున్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నిర్వాహకులు ఒక్కొక్కరికి రూ. 2500 నగదుతో పాటు ప్రశంసాపత్రాలు అందజేసినట్లు విజయ్ డ్రాయింగ్ క్లాసెస్ ఫౌండర్, ఇన్‌స్ట్రక్టర్ ఇరుగుర్తి విజయ్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబరిచిన విద్యార్థులను పట్టణ ప్రముఖులు అభినందించారు.

ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యుడిగా వీరన్ననాయక్

మిర్యాలగూడ : ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యుడిగా దామరచర్ల మండలంలోని మంగళిదుబ్బతండాకు చెందిన ధీరావత్ వీరన్ననాయక్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈనెల 19, 20 తేదీల్లో నల్లగొండలో నిర్వహించిన ఎస్ఎఫ్ఐ 45వ జిల్లా మహాసభలో తనను జిల్లా కమిటీ సభ్యుడిగా ఎన్నుకున్నట్లు తెలిపారు. తనమీద నమ్మకంతో బాధ్యతలు అప్పగించడం సంతోషంగా ఉందని, విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఉద్యమిస్తానని, ఎస్ఎఫ్ఐ బలోపేతానికి తనవంతు కృషి చేస్తానన్నారు.

ఆర్టీసీ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

దేవరకొండ: ప్రజలు ఆర్టీసీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని దేవరకొండ డిపో మేనేజర్ తల్లాడ రమేష్‌బాబు కోరారు. సోమవారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని దేవరకొండ డిపో నుంచి శ్రీశైల దేవస్థానానికి ఈనెల 25వ తేదీ మధ్యాహ్నం నుంచి 27వరకు ప్రత్యేక బస్సు సర్వీసులు నడుపనున్నట్లు తెలిపారు. దేవరకొండ నుంచి శ్రీశైలానికి పెద్దలకు రూ.400, పిల్లలకు రూ.210 చార్జీలు ఉంటాయని వివరించారు. ఈ బస్సుల్లో మహాలక్ష్మి పథకం రాష్ట్ర సరిహద్దు పాతాళగంగ వరకు వర్తిస్తుందని పేర్కొన్నారు.

26న కల్యాణోత్సవం

కొండమల్లేపల్లి : మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని కొండమల్లేపల్లి మండల కేంద్రంలోని శ్రీ సీతారామచంద్రమౌళీశ్వర అయ్యప్ప స్వామి దేవాలయంలో ఈ నెల 26న రాత్రి 9.55 గంటలకు శివపార్వతుల కల్యాణోత్సవం నిర్వహించనున్నట్లు దేవస్థాన కమిటీ ఒక ప్రకటనలో పేర్కొంది. మహాశివరాత్రి సందర్భంగా ఆలయంలో మహాశివుడికి రుద్రాభిషేకం, బిల్వార్చన, మంత్రపుష్పం, మంగళహారతి కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

శివరాత్రికి ముస్తాబైన ఆమనగల్లు ఆలయం



శివరాత్రికి ముస్తాబైన రామలింగేశ్వరాలయం

వేములపల్లి : మండలంలోని ఆమనగల్లు గ్రామంలో కాకతీయుల కాలంలో నిర్మించిన శ్రీ పార్వతీ రామలింగేశ్వరాలయం శివరాత్రి ఉత్సవాలకు ముస్తాబైంది. ఈనెల 26న మహా శివరాత్రి సందర్భంగా ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేశారు. మహిళలకు ముగ్గుల పోటీలు, ట్రాక్టర్ రివర్స్ పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ తాళ్ల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ శివరాత్రి సందర్భంగా ఆలయానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించుకోవాలని కోరారు.

గోధుమపిండితో చేసిన శివలింగం ప్రత్యేకం

గోధుమ పిండితో తయారు చేసిన శివలింగాన్ని దేవాలయంలో ప్రతిష్ఠించారు. ఆనాటి నుంచి పిండితో తయారుచేసిన శివలింగానికే అభిషేకాలు చేస్తున్నా నేటికీ చెక్కుచెదరలేదు. ఈ ఆలయంలో ప్రతి సంవత్సరం హోలీ పండుగకు ముందు మూడు రోజులపాటు స్వామివారి కల్యాణోత్సవాలను వైభవంగా నిర్వహించి చివరి రోజు అగ్నిగుండాల ప్రవేశంతో ఉత్సవాలను ముగిస్తారు. ఈ ఉత్సవాలకు మండలంలోని పలుగ్రామాలతో పాటు చుట్టుపక్కల మండలాల నుంచి భక్తులు భారీగా తరలి వచ్చి స్వామివారిని దర్శించుకుంటారు.

ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి

గుర్రంపోడు : వరంగల్–ఖమ్మం–నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి మండలంలో 26 మంది ఓటు హక్కు కలిగి ఉన్నారని ఇన్‌చార్జ్ తహసీల్దార్ మహ్మద్ ఫరీదుద్దీన్ తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఎన్నికల ఏర్పాట్లపై మాట్లాడారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ నెల 27న 18 మంది పురుషులు, 8 మంది మహిళా ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారని పేర్కొన్నారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు పోలింగ్ జరుగుతుందని తెలిపారు. ఎన్నికల నిర్వహణలో పీఓ, ఏపీఓ, మరో నలుగురు ఇతర పోలింగ్ అధికారులు పాల్గొంటారని, వీరికి శిక్షణ పూర్తయినట్లు పేర్కొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

మిర్యాలగూడ : జిల్లాలో ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున మహాశివరాత్రి వేడుకల సందర్భంగా గ్రామాల్లో సాంస్కృతిక కార్యక్రమాలు, రికార్డింగ్ డ్యాన్స్‌లు, పాటలు, కచేరి, నాటకాలు, అశ్లీల నృత్యాలు వంటికార్యక్రమాలు నిర్వహిస్తే నిర్వాహకులపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని వాడపల్లి ఎస్ఐ సీహెచ్.వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆయన మాట్లాడారు. నిబంధనలు అతిక్రమించొద్దని తెలిపారు.

ఆత్మరక్షణకు కరాటే దోహదం



విద్యార్థులను అభినందించిన ఎమ్మెల్యే బాలునాయక్

దేవరకొండ: ఆత్మరక్షణకు కరాటే ఎంతగానో దోహదపడుతుందని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. ఆదివారం నల్లగొండలో జరిగిన షాటోకాన్ రాష్ట్ర కరాటే ఛాంపియన్‌షిప్ పోటీల్లో జపాన్ కరాటే అసోసియేషన్, ఎస్ఎస్ కరాటే జిమ్నాస్టిక్ అకాడమీ నిర్వహించిన పోటీల్లో దేవరకొండకు చెందిన మాస్టర్ శ్రీను విద్యార్థులు వివిధ విభాగాల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి గెలుపొందారు. ఈ సందర్భంగా సోమవారం దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్ తన కార్యాలయంలో విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో పొట్ట విజయ్, మాస్టర్ శ్రీను, సిరాజ్‌ఖాన్, సర్వయ్య, కిన్నెర హరికృష్ణ, ఎన్‌విటి, పాష పాల్గొన్నారు.

ఆడపిల్లల ఆత్మరక్షణకు కరాటే అవసరం



కరాటే పోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థినులను అభినందిస్తున్న ఎంఈఓ వెంకటమ్మ

వేములపల్లి(మాడ్గులపల్లి) : ఆడపిల్లలకు చదువుతో పాటు తమను తాము రక్షించుకోవడానికి కరాటే ఎంతో అవసరమని మాడ్గులపల్లి ఎంఈఓ వెంకటమ్మ అన్నారు. ఇటీవల జరిగిన జిల్లా స్థాయి కరాటే పోటీల్లో ప్రతిభ కనబరిచి పతకాలు అందుకున్న మాడ్గులపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రవళిక, భవాని, అంజలి, అనుశ్రీలను, కరాటే మాస్టర్ రమేష్‌ను సోమవారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె అభినందించి మాట్లాడారు. అదేవిధంగా ప్రతిభ చాటిన విద్యార్థినులను ఉపాధ్యాయులు శ్రీలత, వినోద, నాగేశ్వర్‌రావు, శ్రీనివాస్‌రెడ్డి, వెంకట్రాములు, శోభారాణి, ఇస్మాయిల్, భాగ్యవతి అభినందించారు.

సంక్షిప్త సమాచారం

మున్నూరుకాపు సంఘం అధ్యక్షుడిగా కొండల్

త్రిపురారం : నిడమనూరు మండల మున్నూరుకాపు కుల సంఘాన్ని సోమవారం మండల కేంద్రంలో జరిగిన సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కలకోటి కొండల్, ఉపాధ్యక్షుడిగా బండారు సైదయ్య, ప్రధాన కార్యదర్శిగా జల్లపెల్లి బాలకోటి, సహాయ కార్యదర్శిగా కడెం తిరుపతి రావు, ప్రచార కార్యదర్శిగా కొత్తపల్లి యాదగిరి, కోశాధికారిగా ఆవుల నరేందర్, గౌరవ అధ్యక్షుడిగా సుంకరి రాంబాబు, ఉద్యోగుల సంఘం అధ్యక్షుడిగా కంచి సైదులు, మండల కార్యవర్గ సభ్యులుగా పసునూరి శ్రీను, అక్కిపెద్ద రామయ్య, బొమ్ము శ్రీను, కంచి శ్రీను, అక్కి శ్రీను, సంకూరి శంకర్, బత్తుల అశోక్, కందుకూరి అంజయ్య, సలాది నాగయ్య ఎన్నికయ్యారు. అనంతరం నూతన అధ్యక్షుడిని సంఘం సభ్యులు శాలువా కప్పి సన్మానించారు.

క్రీడలతో ఉత్తమ భవిష్యత్తు

త్రిపురారం : క్రీడలతో క్రీడాకారులకు ఉత్తమ భవిష్యత్తు ఉంటుందని, యువత పట్టుదలతో క్రీడల్లో రాణించాలని బుసిరెడ్డి ఫౌండేషన్ చైర్మన్ బుసిరెడ్డి పాండురంగా రెడ్డి అన్నారు. సోమవారం సమ్మాన్ కార్యక్రమలో భాగంగా మండలంలోని పెద్ద దేవులపల్లి గ్రామంలోని క్రీడాకారులకు బుసిరెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో వాలీబాల్ కిట్లు, క్రికెట్ కిట్లు, ఎల్ఈడీ లైట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గుండెబోయిన వెంకటేశ్వర్లు, కలగాని శ్రవణ్ కుమార్, నాయిని సంతోష్, నడ్డి లింగయ్య, తురుమలనాథ, రాంరెడ్డి, కొప్పు సోమయ్య, మారయ్య, నాగాచారి, సైదాచారి, వెంకన్న, యూత్ సభ్యులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

గోపాల్‌రెడ్డికి ఓటు వేయండి

మిర్యాలగూడ టౌన్ : నల్లగొండ, ఖమ్మం, వరంగల్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీజేఎస్ బలపరిచిన అభ్యర్థి పన్నాల గోపాల్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని టీజేఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు క్రాంతికుమార్ కోరారు. సోమవారం మిర్యాలగూడ పట్టణంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో ఆయన ఉపాధ్యాయులను కలిసి ఓటు అభ్యర్థించారు. ఆయన వెంట టీజేఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి గుండెబోయిన నాగేశ్వర్‌రావు, నాయకులు ప్రకాశ్ నాయుడు, సైదానాయక్ తదితరులు ఉన్నారు.

స్థానిక సంస్థల ఎన్నిలకు సిద్ధంగా ఉండాలి

డిండి: స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీచేసేందుకు సిద్ధంగా ఉండాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పల్లా నర్సింహారెడ్డి పిలుపు నిచ్చారు. సోమవారం డిండి మండల కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన మండల కార్యవర్గం, కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. అన్ని గ్రామాల్లో పార్టీని బలోపేతం చేయాలన్నారు. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికి అందించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎస్ఎల్‌బీసీలో ఇటీవల జరిగిన ఘటన దురదృష్టకరమన్నారు. ఈ సమావేశంలో సీపీఐ నాయకులు వెంకటరమణ, తూం బుచ్చిరెడ్డి, మైనొద్దీన్, కనకాచారి, శైలేష్, విజయేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేషన్ డీలర్లు సమయపాలన పాటించాలి

మిర్యాలగూడ టౌన్ : ప్రజా పంపిణీ వ్యవస్థను మెరుగుపరిచేందుకు రేషన్ డీలర్లు సమయపాలన పాటించాలని మండల తహసీల్దార్ హరిబాబు అన్నారు. సోమవారం స్థానిక చాంబర్‌లో జరిగిన డీలర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రేషన్ షాపుల్లో తప్పనిసరిగా స్టాక్ బోర్డులు ఏర్పాటు చేయాలని, డీలర్ల వద్ద స్టాక్ రిజిస్టర్లు ఉండాలన్నారు. దుకాణాలను రెన్యూవల్ చేయించుకోవాలన్నారు. అధికారులు తనిఖీలు చేసిన సమయంలో డీలర్లు సహకరించాలన్నారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ రజనీకాంత్, ఆర్ఐలు ఠాగూర్ రామకృష్ణ, బాణావత్ సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

నిర్మాణం తొలగింపు

మిర్యాలగూడ టౌన్ : పట్టణంలోని కృష్ణకాలనీ సమీపంలో హ్యాపీ హోమ్స్ నిర్మాణంలో సెట్ బ్యాక్ లేకుండా రోడ్డుపైకి రావడంతో మున్సిపల్ కమిషనర్ మహ్మద్ యూసుఫ్, టీపీఓ సోమయ్య ఆధ్వర్యంలో నిర్మాణాన్ని సోమవారం తొలగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మున్సిపాలిటీలో ఆమోదం పొందిన ప్లాన్ ప్రకారం కాకుండా రోడ్డుపైకి వచ్చి ఇంటి నిర్మాణం చేపడుతుండటంతో దానిని తొలగించామని అన్నారు. అదేవిధంగా సాగర్ రోడ్డులో తోపుడు బండి నిర్వాహకుడు సురేష్‌కుమార్‌కు రెండు వేల రూపాయల జరిమానా విధించినట్లు తెలిపారు. ఆయన వెంట టీపీఎస్ అంజయ్య తదితరులు ఉన్నారు.

స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలని వినతి

మిర్యాలగూడ అర్బన్ : పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజ్ రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు కుర్ర సైదానాయక్ కోరారు. ఈమేరకు సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో డీఏవో కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయకపోవడంతో కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులను ఫీజులు కట్టాలని ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు జగన్, వీరన్న, అఖిల్, అనిల్, మణి, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

మిర్యాలగూడ : దామరచర్ల మండలంలోని గ్రామపంచాయతీల్లో పనిచేస్తున్న సిబ్బందికి ప్రభుత్వం గత నాలుగైదు నెలలుగా జీతాలు అందించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సీఐటీయూ దామరచర్ల మండల కన్వీనర్ బైరం దయానంద్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం సిబ్బందికి పెండింగ్ వేతనాలను చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం గ్రామపంచాయతీ కార్మికుల మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మహమ్మద్ జైరుద్దీన్, ప్రేమమ్మ, జ్యోతి, మున్నోతు, రాము, లలిత పాల్గొన్నారు.

ఘనంగా స్వపరిపాలన దినోత్సవం



పెద్దవూర : వెల్మగూడెం పాఠశాల విద్యార్థులతో ఉపాధ్యాయులు



త్రిపురారం : బాబుసాయిపేట పాఠశాలలో విద్యార్థులతో ఉపాధ్యాయులు

హాలియా : అనుముల మండలంలోని కొత్తపల్లి ప్రాథమిక పాఠశాలలో సోమవారం స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా, ప్రజాప్రతినిధులుగా, వివిధ శాఖల అధికారులుగా వ్యవహరించారు. ఎమ్మెల్యేగా చరణ్ తేజ్, జిల్లా విద్యాధికారిగా కోరెపాక సమంత, మండల విద్యాధికారిగా కడమంచి చరణ్, కాంప్లెక్స్ హెడ్‌మాస్టర్‌గా భరత్, హెడ్మాస్టర్‌గా కోమన వ్యవహరించారు. అనంతరం విద్యార్థులకు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నిర్మల బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులుపాల్గొన్నారు.

త్రిపురారం : బాబుసాయిపేట గ్రామంలోని ప్రాథమిక ఉన్నత పాఠశాలలో సోమవారం స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. పలువురు విద్యార్థులు జిల్లా అధికారులుగా, ప్రజాప్రతినిధులుగా వ్యవహరించారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ఉపాధ్యాయులు బహుమతులు అందజేశారు. మండల విద్యాధికారి రవికుమార్ నాయక్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

పెద్దవూర: మండలంలోని వెల్మగూడెం ప్రాథమిక పాఠశాలలో సోమవారం స్వపరిపాలన దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రజాప్రతినిధులుగా, అధికారులుగా, ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు చీదెళ్ల శ్రీనివాస్ మాట్లాడుతూ.. విద్యార్థులు కష్టంతో కాకుండా ఇష్టంతో చదవాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మన్నెం వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు రహీం, నామిరెడ్డి ప్రశాంతి, ఉప్పునూతల వెంకటయ్య పాల్గొన్నారు.



హాలియా : కొత్తపల్లి ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులతో విద్యార్థులు